మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ జెండర్ స్పెషలిస్ట్

శామీర్‌పేట్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మేడ్చల్ జిల్లా స్పెషల్ జెండర్ స్పెషలిస్ట్ వాసవి, సవిత అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లిలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో మహిళా సాధారిక కేంద్రం సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి నిర్ణయాలు తీసుకోవడమే మహిళా సాధికారత అని వివరించారు. మహిళలకు ఇంట్లో, పనిచేసే చోట ఎదురయ్యే మానసిక, శారీరక ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని వాటి పరిష్కారానికి మహిళా హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని అన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



మేడ్చల్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: పట్టణ పరిధిలోని కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎంఆర్‌ఈఎం) విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ గ్రామాల్లో పేదలకు నిత్యావసర సరుకులు, రగ్గులు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని అత్వెల్లి, కండ్లకోయ, మేడ్చల్‌లో నిరుపేదలకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. చలికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. మూడు ప్రాంతాల్లో 5 క్వింటాళ్ల బియ్యం, 50కిలోల పప్పులు పంపిణీ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ప్రేమ్‌చంద్, స్టూడెంట్ కౌన్సిలర్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ భవానీ సుబ్బరత్నం, రెక్టార్ కల్నల్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు 33/11 కేవీ బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో సూర్యహిల్స్, రాజశేఖర్ కాలనీ, వెస్ట్ బాలాజీ హిల్స్, హేమానగర్, వాసవినగర్, సప్తగిరి హిల్స్, తిరుమల మెడోస్, ఈస్ట్ బాలాజీ హిల్స్, పద్మావతి కాలనీ, శ్రీనివాస్ కాలనీ, ఆంజనేయనగర్, ద్వారకానగర్, కేశవనగర్, బృందావన్ కాలనీ, సాయిమారుతీనగర్, హుడా లక్ష్మీనగర్, ఆకృతి టౌన్‌షిప్, ఈస్ట్ బృందావన్ కాలనీ, సత్తిరెడ్డి కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, బయ్యన్‌గూడ, బొమ్మక్ బ్రదర్స్ కాలనీ, యాదవ బస్తీ, ఎస్సీ బస్తీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

బోడుప్పల్: లక్ష్మీనగర్(హుడా) కాలనీలో బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఆ కాలనీ అధ్యక్షులు అమరలింగారెడ్డి గురువారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా వాసవి కిరాణాషాపు నుంచి కిరణ్ స్కూల్ వరకు ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగించడం కష్టంగా ఉందన్నారు. ప్రజల బాధలను అర్థం చేసుకుని మరమ్మతులు చేపట్టాలని ఆయన వినతి పత్రంలో కోరారు.

హిట్ అండ్ రన్ చట్టం.. డ్రైవర్లకు ఉరితాడు

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉప్పల్ లారీ డ్రైవర్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర నాయకులు వంగూరు రాములు మాట్లాడుతూ ఈ చట్టం డ్రైవర్లకు ఉరితాడు అన్నారు. హిట్ అండ్ రన్ కేసులో ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు, రూ.7 లక్షల జరిమానాను విధిస్తామని తీసుకువచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు హీరాలాల్, మోహన్‌రెడ్డి, సీఐటీయూ ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, లారీ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: వడ్డే ఓబన్న జయంతి వేడుకలను చిలుకానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యానికి వణుకు పుట్టించిన మహాయోధుడని కొనియాడారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి చేసిన సాయుధ పోరులో పాలుపంచుకున్న ఓబన్న చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. అలాంటి మహనీయుడిని మరిచిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, గుంజ సంతోష్, వడ్డే తమ్మిశెట్టి శివకుమార్, దేవిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖాజా గరిబాన్ నవాజ్ ఉర్సు ఉత్సవాలకు చాదర్



కాప్రా: ప్రతి సంవత్సరం రాజస్థాన్ అజ్మీర్ షరీఫ్‌లోని ఖాజా గరిబాన్ నవాజ్ ఉర్సు ఉత్సవాలకు ఘీలాఫ్(చాదర్)ను అందించనున్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు మాజీ హోం మంత్రి మహమూద్ అలీ ఆధ్వర్యంలో గురువారం చాదర్‌ను తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం రావాలని ప్రార్థిస్తూ చాదర్‌ను అందించనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎం.కె.బద్రోద్దీన్, మలక్‌పేట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఆజం అలీ, బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బసిత్ పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో కళాశాల చైర్మన్, అధ్యాపకులు



మెరిట్ స్కూల్ ఆవరణలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు తల్లులు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి



ఘనంగా సంక్రాంతి సంబురాలు



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు గురువారం సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాలకు చేరుకున్నారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి దంపతులు భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థినులు కళాశాల ఆవరణలో ముగ్గుల వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటంతో పాటు విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసి ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరి త్రిశూల్‌రెడ్డి సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లోకనాథం, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డీన్ రామదాసు, శైలజరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యనారాయణకాలనీలో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణకాలనీలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలను మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి పెద్ద పండగ అన్నారు. ముగ్గుల పోటీల్లో పెద్దఎత్తున కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు. ఉత్తమ ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్, కాలనీకి చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు..

ఘట్‌కేసర్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని అవుషాపూర్ మెరిట్ స్కూల్‌లో విద్యార్థుల తల్లులకు గురువారం ముగ్గుల పోటీ నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ అభినందన్‌రెడ్డి, డైరెక్టర్లు పద్మారెడ్డి, బాబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ పుష్పలత, విద్యార్థులు, స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

పోచారం: సంక్రాంతిని పురస్కరించుకొని పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గురువారం ముగ్గులు పోటీలు జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులను చైర్మన్ కొండల్‌రెడ్డి అందజేశారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న జి.శిరీషకు రూ.2 వేలు, ద్వితీయ బహుమతి దక్కించుకున్న ప్రియాంకకు రూ.1500 నగదు అందజేశారు. ఇతరులకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ నల్లవెల్లి లక్ష్మి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మురళి, శ్రీధర్, యంజాల శివ, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు జరుగుతున్నందున సింగపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్జీకే కాలనీ, పీఎస్‌ఆర్ హైట్స్, మయూరి డెవలపర్స్, సాయినగర్, పకీర్‌టెక్యా, ఎమరాల్డ్ హైట్స్, సూర్యనగర్ కాలనీలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంస్కృతి టౌన్‌షిప్‌లోని డీ2, డీ3, డీ4, ఎ24 నుంచి 35 వరకు, సీ1, సీ2, సీ3 బ్లాకులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 7వ డివిజన్ బీజేఆర్‌నగర్‌లో నివసించే తాటికొండ వంశీ మృతి చెందాడు. కార్పొరేటర్ మెట్టు ఆశాకుమారి స్పందించి బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు వెంకన్నతో మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అశోక్, అంబాజీ, భిక్షపతి, ఆంజనేయులు, పాండు, మాలకొండయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాటంలో వడ్డె ఓబన్న పాత్ర కీలకం

జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్



జవహర్‌నగర్‌లో ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మండల సురేందర్

జవహర్‌నగర్: స్వాతంత్య్ర పోరాటంలో వడ్డె ఓబన్న పాత్ర కీలకమని జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్ అన్నారు. జవహర్‌నగర్ వడ్డె ఓబన్న సంఘం ఆధ్వర్యంలో గురువారం వడ్డె ఓబన్న జయంతి నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు హాజరై ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. ఓబన్న ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి వ్యక్తిగత సైనికుడిగా ఉండి, బ్రిటిష్ వారిపై జరిపిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. వడ్డెర్లంతా ఐక్యమై హక్కులను సాధించుకోవాలన్నారు. కార్పొరేటర్లు పల్లపు రవి, చిత్రసు బ్రహ్మణ్యం, కుతాడి సాయికుమార్, దమ్మాయిగూడ కౌన్సిలర్ సరిత, వెంకటేష్, పద్మారావు, శ్రీనివాస్, నగేష్, జవహర్‌నగర్ వడ్డెర ఓబన్న సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏడుగుళ్ల వద్ద అన్నదానం



మేడ్చల్: పట్టణంలోని ఏడుగుళ్ల వద్ద శ్రీపాద వల్లభ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బీజేపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై అన్నదానం చేశారు. అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ



సోమారంలో అక్షింతల పంపిణీలో గ్రామ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ఏజీ కాలనీ, మేడ్చల్ మండలంలోని సోమారం తదితర గ్రామాల్లో అయోధ్య రామమందిర పూజిత అక్షింతలు గురువారం ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామం, కాలనీల్లో రామచంద్రస్వామి శోభాయాత్ర చేపట్టి అక్షింతలు అందజేశారు. కార్యక్రమాల్లో బీజేపీ అసెంబ్లీ కన్వినర్ మోహన్‌రెడ్డి, సోమారం వార్డు సభ్యులు విశ్వశాంతి, చంద్రశేఖర్, రవి, నాయకులు మల్లారెడ్డి, రమేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్ భక్తులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మేడ్చల్‌రూరల్: భర్తతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట్ జిల్లా మద్దిరాళ్ల గ్రామానికి చెందిన కుంచ్చం శ్రీనివాస్-రాణి దంపతులు కొంతకాలంగా మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 10వ తేదీన రాత్రి సమయంలో కుంచ్చం రాణి సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ కాల్ రావడంతో ఈ విషయంలో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిన రాణి తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన వంశీ

జవహర్‌నగర్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ బీజేఆర్‌నగర్‌లో నివసించే తాటికొండ సుధాకర్ కుమారుడు వంశీ(19) ఇంటర్ వరకు చదివి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వంశీ తల్లిదండ్రులు బుధవారం రోజువారి పనుల నిమిత్తం వెళ్లి ఇంటికి తిరిగి రాగా అతడు ఇంట్లోనే తలుపులు పెట్టుకుని ఉన్నాడు. తలుపులు తీయమని చెప్పినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీ లోంచి చూడగా చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. అయితే ప్రేమ విఫలమై మృతి చెంది ఉండవచ్చని తల్లిదండ్రులు భావించారు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పేదల కోసం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం వెంకటాపూర్ గ్రామానికి చేరుకుంది. స్థానికులకు కేంద్ర పథకాలను స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, గరీబీ కల్యాణ్ యోజన, ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ యోజన, బేటీ పడావో, బేటీ బచావో, ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకాలకు సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కేంద్రం ఇస్తుందన్నారు. ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, ఉప సర్పంచ్ సత్యనారాయణగౌడ్, కార్యదర్శి లింగారెడ్డి, శ్రీనివాసులు, కెనరా బ్యాంకు మేనేజర్ చంద్రకుమార్ సింగ్, వ్యవసాయ, వైద్య, ఉజ్వల పథకం అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సరిగ్గా అందించాలి

సమావేశంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం సరిగ్గా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, సంబంధిత శాఖ అధికారులతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖపై గురువారం ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారాన్ని తప్పకుండా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై అధికారులను పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు జిల్లాలో డే కేర్ సెంటర్ల నిర్వహణ, సెక్టార్ల వారీగా వివరాలు, ఎక్కడైనా కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు అవసరం ఉన్నాయనే వివరాలను జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డితో పాటు సంబంధిత సీడీపీవోలు, సూపర్‌వైజర్లను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ విషయంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ప్రతి ఒక్కరికీ అన్ని రకాల సదుపాయాలు అందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, అంగన్‌వాడీ టీచర్లపై ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా సంక్షేమ అధికారి(డీడబ్ల్యూవో) కృష్ణారెడ్డి, జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్‌లోడ్ పనులను వేగవంతం చేయాలి



ఘట్‌కేసర్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



రాంపల్లిలోని బస్తీ దవాఖానాను తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

కీసర: ప్రజాపాలనలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసే పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. నాగారం మున్సిపల్‌పరిధిలోని కేజీఆర్ కళాశాలల్లో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఇంకా ఎన్ని ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్న విషయాలను మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన తేదీలోపు పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లి బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలోని వార్డు ఆఫీస్‌లో ఉన్న బస్తీ దవాఖానాను మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్తీ దవాఖానాలో మెడికల్ ఆఫీసర్ రెండు మాసాల నుంచి హాజరుకాకపోవడంపై ఆరా తీసి త్వరలోనే ఎంహెచ్‌ఓతో మాట్లాడి కొత్త మెడికల్ ఆఫీసర్‌ను నియమిస్తామని తెలిపారు. నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అర్బన్ యూపీహెచ్‌సీ కోసం స్థలం కేటాయించాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. రాంపల్లి బస్తీదవాఖానా పక్కన సీనియర్ సిటిజన్ రీడింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి బుక్స్ మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, 2వ వార్డు కౌన్సిలర్ నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి

ఘట్‌కేసర్: గ్రంథాలయంలో పాఠకుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని కమిషనర్ సాబేర్ అలీతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలి



ఉప్పల్: ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాల గ్యారంటీల డేటా ఎంట్రీ కేంద్రాన్ని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల ఎంట్రీ విధానాన్ని ఆపరేటర్లను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు.ఉప్పల్ డీసీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి క్లీన్ సిటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు



దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి జాతీయ స్థాయి అవార్డు దక్కింది. 2023 ఏడాదికి గాను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షన్ క్లీన్ సిటీ అవార్డుతో పాటు ఓడీఎఫ్++ ర్యాంకు, జీఎఫ్‌సీ స్టార్-1 రేటు దక్కించుకుంది. ఈ మేరకు ఢిల్లీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు హర్‌దీప్‌సింగ్, కుశాల్ కిశోర్ చేతులమీదుగా జీహెచ్‌ఎంసీ కమిషనర్, సీడీఎంఏ ఇన్‌చార్జి రోనాల్డ్ రోస్, అడిషనల్ డైరెక్టర్ జాన్‌శాంసన్‌తో కలిసి గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో స్వచ్ఛ్ సర్వేక్షన్ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, ఈఈ నర్సింహారెడ్డి, సోర్స్ డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు.

క్లీనెస్ట్ సిటీ రెండోస్థానంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా దేశంలోని అన్ని పట్టణాలతో పోటీపడగా దమ్మాయిగూడ మున్సిపాలిటీకి క్లీనెస్ట్‌సిటీలో దమ్మాయిగూడ మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సౌత్‌జోన్‌లో రెండవ స్థానానికి ఎంపికైందని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రజలు, కృతజ్ఞతలు తెలిపారు.